# కొండంత గుండె



కృష్ణమోహన్ ఆలోచిస్తున్నాడు. ఎంత కాలంగానో ఆలోచిస్తున్నాడు. ఎంత లోతుగానో ఆలోచిస్తున్నాడు. ఆలోచన బుర్రను తొలిస్తే చాలు. అతడు మెల్లగా మేడ మెట్లెక్కుతాడు. మేడపైన అనువైనచోట అందంగా కట్టిన తిన్నెమీద కూర్చుంటాడు. కూర్చొని దూరంగా కనిపించే ఎత్తయిన కొండల్ని చూస్తూ ఆలోచిస్తాడు. ఆ కొండల్ని చూస్తుంటే ఏవేవో భావాలు! ఒక్కొక్కసారి ఆ కొండలు నింగికి నేలకు కట్టిన వారధుల్లా కనిపిస్తాయి. మరొక్కసారి సకల జీవరాసుల జీవనయాత్రకు సారథుల్లా కనిపిస్తాయి. పాషాణహృదయాల్లా స్థాణువులైనా రకరకాల మేఘమాలికలు ముద్దిడుకొంటూంటే ప్రేమబంధానికి సాక్ష్యాలుగా కనిపిస్తాయి. ఆ ఎత్తును పరికించినపుడు మనిషి ఔన్నత్యానికి ప్రతీకలుగా ప్రత్యక్షం అవుతుంటాయి!

ఆ కొండల్ని చూస్తున్నప్పుడంతా కృష్ణమోహన్ మనిషికి కొండంత గుండె ఉండాలనుకొంటాడు. వెంటనే తనకున్నదా? అని ప్రశ్నించుకొంటాడు. తనకున్నది పిడికెడు గుండె అని తోచినప్పుడు అయితే మాత్రం ఏం? పిడికెడు గుండెలో గోరంత మంచికి చోటుండకూడదా అని తర్కించుకొంటాడు.

అందుకే కృష్ణమోహన్ ఆలోచిస్తున్నాడు. ఏదో ఒకమంచిపని చేయాలని ఎంత కాలంగానో అనుకొంటూ ఎంతగానో ఆలోచిస్తున్నాడు. ఒకమంచిపని చేయడానికి ఎంతగానో, ఎంతకాలంగానో ఆలోచించవలసిన అవసరం లేదు. అయితే లోకంలో ఏది మంచి పని అన్నదే కృష్ణమోహన్ ఆలోచన!

పండితుడైన కవికి యతిస్థానం దగ్గర ఎన్నోపదాలు కదం తొక్కుతాయట- 'నన్ను తీసుకో, నన్ను తీసుకో!' అని. కృష్ణమోహన్ మనసులో మంచిపని అన్నమాట మెదిలితే చాలు! లక్ష మంచిపనులు ఎదుట నిలబడి 'నన్ను! నన్ను!' అని మారాం చేస్తాయి. దేనిని ఎన్నుకోవాలన్నదే కృష్ణమోహన్ సమస్య.

చాలాకాలంగా ఈసమస్యతోనే సతమతమైపోతున్నాడు కృష్ణమోహన్.

ఒకరోజు కృష్ణమోహన్ కోరిక ఫలించే అవకాశం అనుకోనట్టుగా దొరికింది.

ఆ రోజు కృష్ణమోహన్ పనిచేస్తున్న ఆఫీసులో ఒకానొక మిత్రుడికి ప్రమోషన్ వచ్చింది. ఆఫీసులో అతని సన్నిహితులందరూ సంతోషంగా చుట్టుముట్టారు. అభినందన పరంపరలతో ముంచెత్తారు. బదులుగా ఆ మిత్రుడు వాళ్ళందర్నీ బార్‌లో ముంచెత్తుతానన్నాడు.

కృష్ణమోహన్‌కి తాగడం అలవాటు లేదు. అయినా ఆ మిత్రుడు విడిచిపెట్టలేదు.

"కృష్ణా! నువ్వేమీ తాగక్కర్లేదు. తాగని వాళ్ళని తాగమని బలవంతం చేయడం కూడా తప్పు. అది 'టేబిల్ మేనర్స్' కూడా కాదు. నా తృప్తికోసం రా! ఒక్క కోకో కోలా తాగుతూ కూర్చో!"

ప్రాధేయపడ్డాడు మిత్రుడు.

"బాబూ! ఒక్క పోలీసు. లాడ్జింగ్‌లో వ్యభిచరించడానికి వెళ్ళి, రైడింగ్ కోసం వెళ్ళినానంటే నమ్ముతుందీ లోకం. మరి నేను బార్‌లోకూర్చుంటే ఈతచెట్టుకింద కూర్చొని పాలు తాగినట్టు పరిణమిస్తుంది వ్యవహారం. ఎందుకీ అనవసరమైన చెడ్డపేరు? నన్ను వదిలిపెట్టు!" కృష్ణమోహన్ తెలివిగా తప్పించుకోవాలి అనుకొన్నాడు.

అయినా ఆ మిత్రుడు రెండుచేతులుచాపి దారికి అడ్డంపడ్డాడు.

కృష్ణమోహన్‌కి ఇక తప్పలేదు.

బార్‌లోకూర్చొని మిత్రులందరూ ఖుషీగా నంజి నంజి తాగుతూ, అడ్డం ఆపూలేకుండా వాగుతూంటే కృష్ణమోహన్ ఒక్క కోకో కోలా సీసా ముందుపెట్టుకొని కూర్చొని ఆ ముచ్చట చూస్తున్నాడు.

ఒక కుర్రవాడు- వయస్సు ఇరవైఏళ్ళకు అటోఇటోగా ఉంటుంది. చాకులా కనిపిస్తున్నాడు. చకచక పని చేస్తున్నాడు.

"ఒరే! రెండు బీర్లు!" నోట్లో మాట నోట్లో ఉండగానే రెండు చేతుల్లో రెండు బీర్లు పట్టుకొని ప్రత్యక్షమవుతున్నాడు.

అంతలోనే ఇంకొకడు "ఒరే! ఇడియట్. స్నాక్స్ ఆర్డర్ చేసి ఎంతసేపయిందిరా" అని తిడుతూంటే తిరిగి చూడకుండా పరుగెత్తుతున్నాడు.

"బాబూ! సిగరెట్ తెచ్చి పెడతావా?" అంటే, "ఒక్క నిమిషం సార్!" అని సవినయంగా సమాధానం చెప్తున్నాడు.

ఎవరేం చెప్పినా విసుగు నసుగూ ఆ ముఖంలో కనిపించడం లేదు.

కృష్ణమోహన్‌కి ఆ కుర్రవాడిని చూస్తుంటే జాలేసింది.

"వాడా వయస్సులో చేయవలసిన పనేమి? చేస్తున్న పనేమి? చిత్రంగా ఉంది. ఒకదానికొకటి సంబంధం లేదుకదా? ఏ కాలేజీలోనో చదువుకోవలసిన కుర్రవాడు ఈ స్థితికి దిగజారడానికి కారణం? ఈ వ్యవస్థ. ఎప్పుడు మారుతుందీ వ్యవస్థ? అసలు మారుతుందా? మారకపోవడానికి కారణమేమి? స్వార్థంతో కొన్ని అదృశ్యశక్తులు ఈ వ్యవస్థను పరిరక్షిస్తున్నాయి. లేకుంటే ఈ కుర్రవాడి తెలివితేటలు... హుషారు... వినయం... అన్నిటికీ మించి ఓర్పు ఈ 'బార్'కే పరిమితమవుతాయా? పోనీ! ఆ పిల్లవాడినే అడిగితే వాడి పరిస్థితులేమిటో తెలుస్తాయి కదా?"

కృష్ణమోహన్ ఆలోచనల్లో పడి కొట్టుకుపోతున్నాడు.

"మీ కింకేఁవన్నా కావాలా సార్?" ఆ మాటతో ఈ లోకంలో పడ్డాడు కృష్ణమోహన్. చూస్తే ఎదురుగా ఆ కుర్రవాడు. కాదు. అదే వయస్సులో మరొక్కడు.

"ఇంతవరకు ఈ టేబుల్‌కు సప్లయి చేసిన కుర్రవాడేమయ్యాడు, బాబూ?"

"వాడా? ఈవెనింగ్ కాలేజీలో చదువుకొంటున్నాడు. సార్! గంట ఆరయిందంటే వెళ్ళిపోతాడు".

కృష్ణమోహన్ ఒక్క క్షణం నిర్విణ్ణుడయ్యాడు. అంతలోనే తమాయించుకొన్నాడు.

"ఆ కుర్రవాడి పేరేమి బాబూ?"

"సుందరం సార్!"

"మళ్ళీ ఎప్పుడొస్తాడు?"

"పగలంతా ఇక్కడే పనిచేస్తుంటాడు సార్!"

"ఇల్లు ఎక్కడో తెలుసా?"

"నాకు తెల్దు సార్! మీకింకేఁవన్నా కావాలా సార్!"

'ఏమిటీ నస?" అన్నట్లుగా వాడి మాటల్లో ధ్వనించింది. కృష్ణమోహన్ పసిగట్టాడు. చిరునవ్వు నవ్వుతూ "ఏమీ వద్దుబాబూ!" అన్నాడు.

ఆ కుర్రవాడు వెళ్ళిపోయాడు.

పార్టీకి ఆహ్వానించిన మిత్రుడికి మనసారా కృతజ్ఞతలు తెలిపాడు కృష్ణమోహన్.

* * * *

వారంరోజుల తరువాత ఒకనాడు కృష్ణమోహన్ తనఇంటి వసారాలో వాలుకుర్చీలో కూర్చున్నాడు. రెండుచేతులు వెనక్కువాల్చి తలకింద పెట్టుకొన్నాడు. కాలుమీద కాలేసుకొన్నాడు. అతని మొగం ఆనందంతో తొణికిసలాడుతూ ఉంది.

మూతి ముభావంగా పెట్టి వాకిలి కానుకొని నిలబడి ఉంది పారిజాతం. కృష్ణమోహన్ వంశోద్ధారకుడు బుజ్జిగాడు హాల్లో కేరింతలు కొడుతూ తిరుగుతున్నాడు.

వాలుకుర్చీకి బారెడుదూరంలో చేతులుకట్టుకొని వినయంగా నిలబడి ఉన్నాడు సుందరం.

"చూడు సుందరం! మనిషికి జంతువుకు తేడా ఉంది. అలానే మనిషికి మనిషికి తేడా ఉంది. మనిషిగా పుట్టిన ప్రతిమనిషి మనిషి కాలేడు. ఏమంటావ్?"

"నిజమే సార్!"

"అందుకే మనిషిగా పుట్టిన తరువాత ఏదైనా ఒక మంచి పని చేయాలంటాను."

"అందరూ అలా అనుకుంటే ఇంకేంవుంది, సార్!"

"ఒకరితో మనకు పనిలేదు సుందరం. మనవరకు మనం ఆలోచిస్తే చాలు. చూడు. నీ వయస్సుకు నేను డిగ్రీ సంపాదించాను. డిగ్రీ వచ్చిన రెండేండ్లకీ ఉద్యోగం వచ్చింది. అయితే నేనుమాత్రం బుద్ధెరిగిన నాటినుండి ఏదో ఒక మంచిపని చేయాలనుకొంటున్నా. ఇంతకూ ఇదంతా చెప్తున్నానంటే నిన్నా కలుషిత వాతావరణం నుండి బయటికీడ్చి ఒక మంచి మనిషిగా తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం. అందుకే నిన్ను నా ఇంటికి పిలిపించాను. ఇకమీదట ఇది నీ ఇల్లు. ఈ కుటుంబంలో నువ్వొక్కడివి. పెట్టింది తింటూ చెప్పిన పనిచేస్తూ శ్రద్ధగా చదువుకొంటూ నువ్వొక మనిషి కావాలి. అది నాకు తృప్తి. అదే నాకు ఆనందం. ఆ తృప్తిని మిగిలించుతావనే నా నమ్మకం!"

ఈ మాటలు అంటుంటే కృష్ణమోహన్ గొంతు జీరపోయింది.

కన్నుల్లో నీళ్ళు చిప్పిలుతూంటే సుందరం చేతులు జోడించాడు.

హాల్లో కేరింతలు కొడుతూ తిరుగుతున్న బుజ్జిగాణ్ణి విసురుగాఎత్తి చంకలోవేసుకొని లోనికి వెళ్ళింది కృష్ణమోహన్ సతీమణి. అదిచూసి సన్నగా నవ్వుకొన్నాడు కృష్ణమోహన్.

ఆరోజునుండి ఆ కుటుంబంలో ఒకడయ్యాడు సుందరం.

రాధాకృష్ణకు ఇది ఏమాత్రం గిట్టలేదు.

రాధాకృష్ణ కృష్ణమోహన్‌కి చాలా సన్నిహితుడైన స్నేహితుడు. ఆపదల్లో ధైర్యం, అవసరమైనప్పుడు సలహాలు తన బాధ్యతగా అందచేస్తుంటాడు. అందుకే ఒకనాడు-

"మోహన్! నువ్వు చేసిన పని నాకేమీ నచ్చలేదురా!" అన్నాడు.

"ఎందుకు రాధా?"

"సుందరం పనిచేస్తూ ఉండిందొక బార్ అన్న సంగతి మరిచిపోవద్దు. ఏ వ్యక్తిమీదైనా సరే పరిసరాల ప్రభావం తప్పక పడి తీరుతుంది. 'బార్' అంటేనే కలుషిత వాతావరణం. ఆ వాతావరణంలో పడిలేస్తూ ఉంటే ఎలాంటి మనస్సయినా కలుషితమై పోతుంది."

"అటువంటి మనస్సును బాగుచేయాలన్నదే కదా నాఆశయం."

"అది మగతృష్ణలో నీళ్ళు తాగినంత పని."

"ఎందుకలా అంటున్నావ్?"

"మోహన్! నీకు తెలియనిది కాదు. మనిషి దేనికైనా అలవాటుపడితే ఇక అంతే! ఆ అలవాటునుండి మళ్ళించడం మహాకష్టం."

"అయితే సుందరం బారులో తాగడానికి అలవాటుపడి ఉంటాడంటావా?"

"అని నే ననలేదు. వాడిమనస్సు 'కమీషన్' తత్వానికి బాగా అలవాటుపడి ఉంటుంది."

కృష్ణమోహన్ ఆమాట వింటూనే విరగబడి నవ్వాడు.

"ఎందుకలా నవ్వుతున్నావ్?"

"ఏమీ లేదు. మనం ఓడలమీద వ్యాపారం చేస్తున్నాం. వడ్డీలకు మారుస్తున్నాం. ఈ లావాదేవీల్లో- ఓహో! వాడు కొట్టబోయే కమీషన్!" మాట పూర్తి చేయకుండానే మళ్ళీ నవ్వుతున్నాడు కృష్ణమోహన్!

"తగులుతుందని చెప్తే మనిషి తడుముకోడు. తగిలితే తప్పకుండా తడుముకుంటాడు."

"అయితే నాకు తగులుతుంగంటావ్! తగలనీ చూద్దాం!"

రాధాకృష్ణ నవ్వి ఊరుకున్నాడు.

కృష్ణమోహన్ రోజూ ఉదయం ఆఫీసుకు వెళ్ళి సాయంకాలం వస్తున్నాడు. సుందరం పగలంతా ఇంటిపనుల్లో చేదోడు వాదోడుగా ఉండి సాయంకాలం కళాశాలకు వెళ్ళివస్తున్నాడు. సుందరం ఆఇంట్లో అడుగు పెట్టినప్పుడు నిజానికి పారిజాతానికేమాత్రం ఇష్టం లేదు. అయితే భర్తమాటకు అడ్డు చెప్పలేకుండా నోరు మూసుకొనింది. కానీ ఇప్పుడు సుందరం పగలంతా ఇంటిపట్టునే ఉన్నాడు. పిలిస్తే పలుకుతున్నాడు. చెప్పిన పని క్షణాలమీద చేస్తున్నాడు. 'బుజ్జిగాణ్ణి కింద దించితే మట్టిఅవుతుంది, పైకెత్తితే గద్ద తన్నుకుపోతుంది' అన్నంత ముదిగారంగా చూసుకొంటున్నాడు. మధ్యాహ్నం కృష్ణమోహన్‌కి భోజనం ఆఫీసుకు వెళ్ళి ఇచ్చివస్తున్నాడు. పెట్టింది తింటూ చెప్పిన పనిచేస్తూ శ్రద్ధగా కాలేజీకి వెళ్ళి చదువు కొంటున్న ఆ కుర్రవాడిమీద తనకు తెలియకనే అభిమానం పెరిగిపోయింది!

మొదట మొదట కృష్ణమోహన్‌కు కూడా లోలోపల సందేహమే! సుందరం ఇంట్లో ఇమడగలడా? లేదా? ఇమిడితే గిమిడితే ఇల్లాలి తీరెలా ఉంటుందో? ఈ తగాదాలు తీర్చలేక తల బొప్పి కడుతుందేమో? తన ఆశయం నెరవేరుతుందో? లేదో? ఇలా సవాలక్ష సందేహాలతో కృష్ణమోహన్ సతమతమవుతూ ఉండేవాడు. ఇంటిలో అనుకూల వాతావరణం ఏర్పడేసరికి అతని మనస్సు కుదుట పడింది. వాతావరణం అనుకూలంగా ఉంటే కాలం తొందరగా తొందరగా గడిచినట్లుంది.

ఒకరోజు సుందరం ఎక్కడికో బయటికి పనిమీద వెళ్ళాడు. కృష్ణమోహన్ ఆఫీసుకు బయలుదేరుతున్నాడు.

"ఏమండీ! ఏమండీ!...ఒక్కమాట!" అంటూ పారిజాతం కృష్ణమోహన్‌ని పిలిచింది.

"ఏమిటమ్మా ఆ మాట?" అన్నట్లు కృష్ణమోహన్ భార్యవైపు చిలిపిగా చూశాడు.

ఏదో పెద్ద రహస్యం చెప్పబోతున్నట్లుగా పారిజాతం దిక్కులు చూసింది.

"పిచ్చిదానా మన ఇంటి గోడలకు చెవుల్లేవు లేయే! ఎందుకలా చూస్తావ్? చెప్పు!" తొందర పెట్టాడు కృష్ణమోహన్.

"ఏవీ లేదండీ! అయిదులీటర్ల కిరోసిన్ తెస్తే మనకు వారంరోజులకు సరిగ్గా వచ్చేది. ఇప్పుడేమో అయిదు రోజులకే అయిపోయిందండీ!"

ఆ మాట చెవిని పడడంతో పారిజాతం కాదుకానీ అమె చంకలోని బుజ్జిగాడు గుక్క పట్టే తీరులో గుక్క పట్టి నవ్వుతున్నాడు కృష్ణమోహన్.

"ఎందుకలా నవ్వుతారు? ఏది చెప్పినా నవ్వులాట కింద కొట్టిపారేస్తే ఎలా? అబ్బబ్బ! మీతో సంసారం చేసేదానికంటే నెత్తిన గుడ్డేసుకుని బయల్దేరి కాశీలో తిరిగి చూడచ్చు!"

"నువ్వు తిరిగిచూడకుండా పోతూఉంటే నీడలా నీవెంట నేనూ వస్తూనే ఉంటాను. అప్పుడేం చేస్తావ్?"

"మీ వేళాకోళానికి వేళాపాళా లేదా? చేస్తున్నది సంసారమండీ!"

"అవునవును. చేస్తున్నది సంసారంగదూ? ఆ మాటే మరిచిపోయాను. ఇంతకూ మనం ఆరంభించిందెక్కడ? కిరోసిన్ దగ్గర. అసలు సమస్య ఏమిటి? వారానికి రావలసిన కిరోసిన్ అయిదు రోజులకే అయిపోయింది. అయితే ఈ అయిదు రోజుల్లో ఎప్పుడెప్పుడు ఏయే వంటకు ఎంతెంతసేపు స్టౌ వెలిగించారో చెప్పండి చూద్దాం!"

"ఇప్పుడెలా చెప్పమంటారండీ?.... నేనేమన్నా రాసిపెట్టుకున్నానా?"

"మరి ఎప్పుడెప్పుడు ఎంతెంతసేపు ఏయే వంటలకు ఉపయోగించారో ఇప్పుడు చెప్పలేరు గనుక, ఒకవేళ ఈ వారంలో ఎక్కువగా ఉపయోగించవలసిన అవసరం ఉండి ఉండవచ్చు గనుక, వారం రోజులకు రావలసిన కిరోసిన్ అయిదు రోజులకే అయి పోయిందంటే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదనుకుంటాను. గనుక!...."

"సంసారం చేస్తున్నదానిని ఆ మాత్రం నాకు తెలియదాండి!"

"ఇందులో నిన్నని ప్రయోజనం లేదు. వాడా రాధాకృష్ణ ఉన్నాడే వాడు పెట్టాడు మన బుర్రలకంత సేంవిరి!

పారిజాతం మూతి ముడుచుకుని లోనికి వెళ్ళింది.

కృష్ణమోహన్ ఆఫీసుకు బయలుదేరాడు హుషారుగా నవ్వుతూ!

మరొక రోజు సాయంకాలం-

కృష్ణమోహన్ హాల్లో వాలుకుర్చీలో పడుకొన్నాడు. సుందరం కాలేజీకి వెళ్ళాడు. బుజ్జిగాడు కృష్ణమోహన్ పొట్ట మీదికెక్కాడు. కేరింతలు కొడుతూ... ఎగిరెగిరి తొక్కుతూ... జారి జారి

పడుతూ... గిల్లుతూ గీకుతూ- ఉంటే కృష్ణమోహన్ వాడితోకలిసి తానూ ఒకపిల్లవాడై దాదాపు ఈ లోకాన్ని మరిచిపోయాడు.

సంధ్యారాణిలా పారిజాతం హాల్లో అడుగు పెట్టింది. ఒక్కసారిగా హాలు వెలుగుతో నిండిపోయింది.

"అబ్బబ్బ! అబ్బా కొడుకుల ఆనందానికి పట్టపగ్గాల్లేవే? రేపటికి కూడా కాస్త ఉండనీయండి. ఇదేఁవిటి? హాల్లో లైట్ కూడా వేయకుండా?"

"తాము విచ్చేశారు కదా? ఇక లైటెందుకు?"

"ఆఁ! మాటలకేం తక్కువ లేదు!" అని దీర్ఘం తీస్తూ పారిజాతం మీట నొక్కింది. హాలు వెలుగుతో నిండిపోయింది.

"మరి చూశావా? నామాటే అబద్ధమన్నావే?"

"అది సరేకానీ... నాకొక సందేహమండీ?"

"ఒక్కటే గదా? అయితే రక్షించావ్!"

'మీ రన్నీ తేలిగ్గా కొట్టిపారేస్తారండీ! అందుకే చెప్పాలా వద్దా అని...'

"ఇదో! ఇల్లాంటి సందేహాలే కూడదంటున్నా! బరువెప్పుడూ బరువుగానే ఉంటుంది. తేలిగ్గా ఉండేదెప్పుడూ తేలిగ్గానే ఉంటుంది. బరువును తేలిక చెయ్యలేము- అలాగే తేలికను బరువు చెయ్యలేము."

"ఇదో ఇలా! తలకేస్తే మొలకు. మొలకేస్తే తలకు! వద్దులెండి. మీతో చెప్పుకోడానికంటే ఆ గోడతో చెప్పుకోవడం నయం."

"అహాహ! ఎంత కాలానికి సత్యాన్ని గుర్తించావ్ సతీమణీ! చెవుల్లేనివాళ్ళతో చెప్తే చెవులుండే వాళ్ళకు వినిపిస్తుంది. అప్పుడా గోడకు తృప్తి. నీకానందం. ఎలా ఉందంటావ్?"

"ఏడవలేక నవ్వినట్లుంది గానీ, సుందరాన్ని రెండు కిలోల ఉల్లిపాయలు తెమ్మన్నానండీ!

"తెమ్మంటే తక్కువ తెచ్చాడు. అంతేగదా నువ్వనడం?

ఆ మాటంటూ విసురుగా లేచాడు. దురుసుగా బయటికి నడిచాడు. ఆ తీరు అర్థంకాకుండా అలానే నిలబడి పోయింది పారిజాతం.

"ఏమిటీ మనిషితత్త్వం? వాడికీ ఈయనకూ ఏమి సంబంధం? వాడి మీద మాట అలాపడనీయడే? ఈగ అలా వాలితే విలవిల్లాడిపోతాడే! దగ్గర బంధువుగా ఉంటాడా? నాతో చెప్తే రంపుచేస్తానని ఇలానాటకం ఆడుతున్నాడా? లేదు. వీడిని అడ్డం పెట్టుకొని అయ్యగారే మయినా గ్రంథం నడుపుతున్నారా? లేకుంటే 'బార్' లో ఎంతోమంది పన్జేస్తుంటే బొట్టూ కాటుకపెట్టి పిలిచినట్లుగా వీడినే ఎందుకు పిలుచుకొని వస్తాడు?"

పారిజాతం కదలకుండా నిలబడినా ఆమె మనస్సు మాత్రం పాదరసంలా పరుగెత్తుతూ ఉంది.

పట్టుమని పది నిమిషాలు గడవలేదు.

ఒకచేత్తో త్రాసు మరొకచేత్తో తూకంరాళ్ళు పట్టుకొని కృష్ణమోహన్ వీరావేశంతో కత్తీ డాలూ చేపట్టిన వీరుడిలా ఇంట్లో దూరినా ఏదో ఒక నిశ్చితాభిప్రాయంతో అతని కండ్లు జ్వలిస్తున్నాయి. అతని తీరు చూసి పారిజాతం నివ్వెరపడింది.

"ఎక్కడ ఉల్లిపాయలు? పో! తీసుకురా!" హుకుం జారీ చేసినంత హుందాగా అన్నాడు కృష్ణ మోహన్.

ఆ మాటతో ఉలిక్కిపడింది పారిజాతం. మారు మాట్లాడకుండా లోనికి వెళ్ళింది. ప్లాస్టిక్ బుట్టతో ఉల్లిపాయల్ని తెచ్చి అతని ముందుంచింది.

"ఇందులో ఇదివరకే మీ ఉపయోగించలేదు కదా?"

"అదేందండీ అలా మాట్లాడుతారే? బుజ్జిగాడిమీద ఒట్టండీ!"

"సరే!"

కృష్ణమోహన్ దర్జాగా నేలమీద కూర్చున్నాడు పెద్ద వ్యాపారస్థుడి ఫోజులో. త్రాసుచేత పట్టుకొన్నాడు. ఉల్లిపాయల్ని నికార్సుగా తూచాడు. సరిగ్గా ఒకటిన్నర కిలోనే ఉన్నాయి.

కృష్ణమోహన్ వంచితల ఎత్తలేదు!

"కలిగిన మాటంటే కంట్లో పుల్లపెట్టినట్టంట. నెత్తిననోరుపెట్టుకొని చెప్తుంటే మాటచెవుల్లో వేసుకుంటేగదా? కొంపలో ఒకమనిషి బతికే ఉండాది. దానికీ అంతోఇంతో తెలివిఉంది అని ఆలోచిస్తే కదా! ఇంతకూ ఒకరిని అని ఏం ప్రయోజనం? నా తలరాత ఇలా రాసి పెట్టుంటే! దోవనపొయ్యే వాణ్ణి తెచ్చి నట్టింట చేరిస్తే ఇంతకన్నా ఏం జరుగుతుంది?"

అవకాశాన్ని జారవిచుకోకుండా దండకాన్ని మాటల పూలదండలా అల్లింది పారిజాతం.

కృష్ణమోహన్ నోరు కదపలేదు.

హాల్లో వాలుకుర్చీలో పడుకొన్నాడు. వాలుకుర్చీలో పడుకొంటే చేతుల్ని తలకింద దిండులాగా పెట్టుకొనే అలవాటు. ఇప్పుడు చేతులెత్తి సరిగ్గా తలమీద పెట్టుకొన్నాడు. ఈ మనుషుల్ని, మనస్తత్వాల్ని చూసి భరించలేనట్లుగా కండ్లు మూసుకొన్నాడు.

కర్మేంద్రియాల్ని కట్టడి చేశాడు. కానీ జ్ఞానేంద్రియాల్ని అదుపులో పెట్టుకోవడానికి తానేమీ జ్ఞాని కాదు.

"ఏమిటీ కుర్రవాడి మనస్తత్వం? మూడు పూటలు లక్షణంగా తిండి తింటున్నాడు. వారానికొకసారి సినిమాకు డబ్బులిస్తున్నాను. బట్టలా? కాలేజీ కుర్రవాళ్ళలో ఎవరికీ తీసిపోని

రీతిలో ఉన్నాయి. మరి వీడెందుకీ బరిగాట లాడుతున్నాడు? రాధాకృష్ణ అన్నప్పుడు నేనేమో అనుకున్నాను కానీ, నిజమే!– వీడి బుర్ర 'కరప్ట్' అయిపోయింది ఎలా దీనిని మార్చడం?"

ఆ రాత్రంతా ఇలాంటి ఆలోచనలతోనే గడిచిపోయింది.

తెల్లారింది.

కృష్ణమోహన్ నిద్రలేచీలేవడంతోటే సుందరాన్ని పిలిచాడు. ఇరవై రూపాయలు చేతికిచ్చాడు. మార్కెట్టుకు వెళ్ళి మూడు కిలోల చింతపండు తెమ్మన్నాడు. సుందరం హుషారుగా డబ్బు చేతికందుకొన్నాడు. సంచీ చేతపట్టుకొన్నాడు. అది చేతిలో గిరికీలుకొట్టూ ఉంది. మనిషి చెండులా ఎగిరిపోతున్నాడు.

కృష్ణమోహన్ బుర్రను పురుగు తొలుస్తూ ఉంది.

"ఒరే! దుర్మార్గుడా! ఏదైనా పనిచెప్తే మూతి మాడ్చుకోవడం ఎవరికైనా పరిపాటి. కానీ నువ్వెంత సంబరపడి పోతున్నావురా! అంటే నాలుగుపైసలు కమీషన్ దొరుకుతుందనే కదూ నీ ఉబలాటం? దొరుకుతుంది. దొరుకుతుంది. కమీషన్ నీకు దొరుకుతుంది. నువ్వు నా చేతికి దొరకతావు. అప్పుడు చెప్తా నీ పని. ఈ రోజుతో అటో ఇటో తేలిపోవాలి!"

కృష్ణమోహన్ ఆలోచించినంతసేపు పట్టలేదు సుందరం తిరిగి రావడానికి.

సుందరం సంచీలో చింతపండు తెచ్చాడు. నేరుగా వంటింట్లోకి వెళ్ళాడు. ఆ సంచీని పారిజాతం చేతికిచ్చాడు. తిరిగి హాల్లోకివచ్చి మిగిలిన డబ్బును కృష్ణమోహన్ చేతికిచ్చాడు. ఆ డబ్బు చేతికి తీసుకుంటూనే 'పారిజాతం'! అని ఒక్కగావుకేక పెట్టాడు కృష్ణమోహన్.

ఉన్నపళంగా ఆమె హాల్లోకి వచ్చింది. సుందరం తెచ్చిన చింతపండు సంచీ ఆమె చేతిలోనే ఉంది.

"ఆ చింతపండక్కడ పొయ్!"

కృష్ణమోహన్ మాటల్లో కరుకుతనం చూపుల్లో చురుకుతనం ఉంది.

పారిజాతం మారుమాట్లాడకుండా చింతపండు నేలమీద పోసింది.

కృష్ణమోహన్ త్రాసుచేత పట్టుకొన్నాడు.

సుందరం గుండెను గుప్పెట్లో పెట్టుకొన్నాడు. అయినా అది కుదుట పడలేదు.

"ఉన్నట్లుండి ఏమిటీ పరీక్ష? అంటే నన్ను నమ్మినట్లే నా మీదొక కన్నుంచినారన్నమాట. సరేలే చూద్దాం!" అని సుందరం ఆలోచిస్తున్నాడు.

బుజ్జిగాణ్ణి చంకనవేసుకుని చింతపండు తూస్తున్న భర్తను చూస్తున్న పారిజాతం పూచిన పువ్వులా ఉంది. గుండెలోని భావం ముఖాన్ని గంభీరంగా మారిస్తే కృష్ణ మోహన్ అటు ఇటు చూడకుండా తూకంలో నిమగ్నుడయ్యాడు.

ఒక్క చింతగింజ ఎత్తు తక్కువ లేకుండా సరిగ్గా మూడుకిలోలు ఉంది చింతపండు!

కృష్ణమోహన్ భార్యవైపు ఒక్క చూపు విసిరాడు. ఆమె తలవాల్చింది. అతను త్రాసును విసిరికొట్టినంత దురుసుగా అవతల పారేసి పైకి లేచాడు. పారిజాతం వంచిన తల ఎత్తలేదు. సుందరం చింతపండును సంచికెత్తుతున్నాడు.

ఆ ఇంట్లో గుండెలు మాత్రమే సవ్వడి చేస్తున్నాయి. మనుషులు లేరనే భ్రాంతిని కల్పించి మౌనం రాజ్యం ఏలుతూఉంది.

ఇంట్లో పొందకుండా కృష్ణమోహన్ ఇంటినుండి బయటపడ్డాడు. ఆఫీసుకు నడుస్తున్నాడు. తొమ్మిది గంటలవేళ. కడుపులు చేతపట్టుకొన్నలోకం తనలోకం తనదిగా పోటీపడి ముందుకు సాగిపోతూ ఉంది. ఆ పోవడంలో కూడా వాపోవడాలు!

పోట్లాటలా తయారయింది రోడ్లమీద రద్దీ!

కృష్ణమోహన్ మనస్సు కూడా అలాగే ఉంది.

"ఛీ ఛీ! ఎంత పొరబాటు చేశాను! ఆడదాని బుద్ధి అలుసుబుద్ధి అంటారు. అదే నిజమయింది. ఆ రోజు అరకిలో ఉల్లిపాయల్ని దాచిపెట్టేసే పారిజాతం నాటకమాడి నట్లుంది. లేకుంటే ఉల్లిపాయల్ని తక్కువగా తెచ్చినవాడు చింతపండును మాత్రం ఎలా సరిగ్గా తెస్తాడు? అయినా పారిజాతానికెందుకీ కక్ష వాడిమీద? కాలేజీ చదువుకొంటున్న కుర్రవాడు. ఏమనుకున్నాడో? ఏమో?"

రకరకాలుగా ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

"ఏమిరా తండ్రీ? పగటిపూటే ఈ పరధ్యానం?"

ఈ దెప్పడంతో అదిరిపడినట్లుగా ఈ లోకంలో పడ్డాడు కృష్ణమోహన్.

ఎదురుగా రాధాకృష్ణ చేతిలో సంచీ పట్టుకొని నిలబడి ఉన్నాడు.

"ఏం రాధా సంచీ చాలా బలంగా ఉందే?"

"ఏమీ లేదురా? సీజను కదా? చింతపండు కొనిపెట్టే కాస్త చవగ్గా కొన్నట్లు అవుతుంది. పండు పాతబడితే కలిసీ వస్తుంది."

"ఎలా ఇచ్చారు కిలో!"

"నాలుగు రూపాయలు!"

"నాలుగు రూపాయలా?" కృష్ణమోహన్‌కు తనకు తెలియకనే మాటల్లో ఆశ్చర్యం.

"ఏం అంత ఆశ్చర్యపడుతున్నావ్? మనవాడేమైనా టోపీ వేశాడా?"

"ఛఛ! ఏం మాటల్రా? మాటెత్తితే వాడిమీద పడతా రెందుకూ?"

"పడింది నువ్వా? నేనా? ఆలోచించుకో."

ఆఫీసుకు టైమ్ అయిపోతుందేమో అన్న సందేహంతో రాధాకృష్ణ సంభాషణ కొనసాగించలేదు. కృష్ణమోహన్ గుండెని ఏదో పట్టి పీకుతున్నట్లుంది. ఒక్కక్షణం నివ్వెరపాటుతో

అటు ఇటు కదలలేకుండా నిలబడ్డాడు. కొసమెరుపులా కొనచూపుల్ని మాత్రం విసిరి రాధాకృష్ణ ముందుకు నడిచాడు.

"ఒరే దుర్మార్గుడా! ఎంత పని చేశావురా! నీమీద పెంచుకొన్న ఆశలన్నింటినీ సమూలంగా తుంచేస్తున్నావ్ కదరా! ఏం పోగాలంవచ్చిందిరా నీకు? ఒక రోజు తూకంలో కమీషన్. ఇంకొక్క దినం వెలలో కమీషన్. బాగుంది వరస. నిన్నునమ్మి అన్యాయంగా కట్టుకొన్న పెండ్లాన్ని ఆడిపోసుకొన్నాను కదరా? అనవసరంగా సందేహించాను కదరా? ఏమైనా రాధాకృష్ణ ఉన్నాడే! చాలా దూరదృష్టి కలిగినవాడు. ఆదర్శాలనీ... మార్గదర్శాలనీ దోవనపొయ్యే జగడాన్ని ఇంటిదాకా తెచ్చుకోడు. మొదటనే వాడి మాట వినుంటే బాగుండేది. ఇప్పుడు మాత్రం మునిగిపోయిందేమి? ఈ వెధవను వెళ్ళగొట్టాల్సిందే!"

కృష్ణమోహన్‌కు మనస్సులో మనస్సు లేదు. దాని ఇష్టమొచ్చినట్లు అది పోతున్నా, కాళ్ళుమాత్రం క్రమం తప్పలేదు. గుడ్డివాడికి కూడా అలవాటయితే దారి తోడు అవసరం లేదు. కృష్ణమోహన్ ఆఫీసు చేరుకొన్నాడు. కుర్చీలో కూలబడ్డాడు. శారీరకంగా కుదుట పడినట్లే? అయితే మానసికంగా...?

"ఇంట్లో నుండి వాణ్ణి వెళ్ళగొట్టాలనుకున్నాను. అనుకోవడం వరకు బాగానే ఉంది. చెబితే వినడానికి కూడా సమంజసం గానే ఉంటుంది. అయితే నా ధ్యేయం?... ధ్యేయాన్ని అందుకోవడమంటే అంత సులభం కాదు కదా! ఎన్ని అడ్డంకులు! మరెన్ని కష్టాలు...."

"సార్! మీకు ఫోన్ వచ్చింది!" అన్న మాటతో కృష్ణమోహన్ ఆలోచనకు అంతరాయం కలిగింది. ఆ వేళప్పుడు తనకు ఫోన్ చేసే వారెవరబ్బా? అనుకుంటూనే ఒక్క ఊపులో వెళ్ళి ఫోన్ అందుకొన్నాడు.

"సార్! సార్!! ఉన్నట్లుండి బుజ్జిగాడికేమయిందో తెల్లేదు, సార్!! అల్లాడి పోతున్నాడు. అమ్మ ఏడుస్తూ ఉంది. మీరు వెంటనే రండి, సార్!"

అవతలి వైపు నుండి సుందరం గసపోసు కొంటూ చెబుతున్నాడు. ఇది కూడా నిజమా? అబద్ధమా? అని కృష్ణమోహన్ ఒక్కక్షణం నిలబడి ఆలోచించాడు. ఏది ఏమైనా కానీ అని ఆ పూటకు సెలవు పెట్టాడు.

కృష్ణమోహన్ రిక్షాలో కూర్చున్నాడు. తొందరగా పోనీమన్నాడు. అతని మనసుకంతా గందరగోళంగా ఉంది. వచ్చేప్పుడు బుజ్జిగాడు కేరింతలు కొడుతూ ఆడుకొంటున్నాడు కదా! ఇంతలో ఏమై ఉంటుంది? అని కలవరపడిపోతున్నాడు.

ఇంటిముందర రిక్షా ఆగింది. అప్పటికే ఇంటినిండా ఇరుగు పొరుగు చేరారు. తలకొక్క తీరుగా మాట్లాడుతున్నారు.

బుజ్జిగాడు తల్లి చంకలో నిలవడం లేదు. పడక పొందడం లేదు. కాళ్ళు, చేతులు విదిలిస్తూ ఒకటే ఏడుపు. వాడి బాధ వాడు చెప్పుకోలేడు. వాళ్ళకర్థం కాదు. అంతా అయోమయంగా

ఉంది. కృష్ణమోహన్ వచ్చిన రిక్షానే తిప్పమన్నాడు. పారిజాతం బుజ్జిగాణ్ణి ఎత్తుకొనింది. ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు. హుటా హుటిగా డాక్టరు దగ్గరికి బయలుదేరారు. సుందరం ఇంటికి తాళాలు వేసి రిక్షా వెంట పరుగెత్తుతున్నాడు.

రిక్షా డాక్టరు ఇంటిముందు ఆగింది. కృష్ణమోహన్ బుజ్జిగాణ్ణి అందుకొని ఆదరాబాదరా డాక్టర్ దగ్గరికి పరుగెత్తాడు. డాక్టరు పిల్లవాణ్ణి పరీక్షించాడు. సూది మందేదో ఇచ్చాడు. వెంటనే మరికొన్ని మందులు కావాలని  చీటి రాసి ఇచ్చాడు. సుందరం డాక్టరు దగ్గర నుండి ఆ చీటిని కృష్ణమోహన్ దగ్గరనుండి వందరూపాయల నోటును అందుకొని పరుగందు కొన్నాడు. మందులషాపు ముందర నిలబడి చీటి అంగడివానికి చూపించాడు. సావకాశంగా ఆ చీటిని చదివి అటుపైన అంగడివైపు అలా కలయచూసి తరువాత అలవోకగా పెదవి విరిచాడు. ఆ తీరుచూసి సుందరానికి లాగి చెంపదెబ్బ కొట్టదామన్నంత కోపం వచ్చింది. అయినా సమయం కాదు. ఆ చీటి చేతికందుకొని చేతిలో చీటి చేతులో ఉండగానే మరొక్క అంగడికి పరుగెత్తాడు. అక్కడ చీటి అందుకోవడమే తరువాయి. మందుల ప్యాకెట్ తయారయింది. డబ్బిద్దామని జేబులో చెయ్యి పెట్టాడు. గుండె ఆగినంత పని అయింది.

జేబులో వంద రూపాయల నోటు లేదు. సుందరానికి ముచ్చెమటలు పోశాయి. నోరు తడారింది! "ఏమయిందిరా, అబ్బాయీ?" అని అడుగుతూంటే వినిపించుకోకుండా మొదట వెళ్ళిన మందుల అంగడి దగ్గరికి వెళ్ళాడు. అక్కడంతా వెదికాడు. ఆపైన రోడ్డంతా వెదుకుతూ డాక్టర్ ఇంటి ముందు వరకు వచ్చాడు. మళ్ళీ వెదుక్కొంటూ మందుల అంగడి చేరాడు.

వాడి మొగం చూస్తూనే అర్థమవుతుంది. ఏదో పోగొట్టుకున్నాడని! అయినా అంగడి వాళ్ళు అడిగారు. "ఏమయిందిరా అబ్బాయీ!" అని. ఆ పలకరింపుతో సుందరానికి ఏడుపు ఆగలేదు. అయినా ఎలాగో నిబ్బరించుకుంటూ "సార్! సార్! మా బుజ్జిగాడికి చాలా సీరియస్‌గా ఉంది సార్! వంద రూపాయల నోటు సార్! ఎక్కడ పడిపోయిందో తెలియదు సార్! మందులివ్వండి సార్! డాక్టర్ కిచ్చేసి మా అబ్బతోడు తెచ్చిస్తాను సార్!"

సుందరం కన్నీళ్ళు కారుస్తూ ప్రాధేయపడినాడు.

అంగడివాడు పకపకా నవ్వాడు!

జరిగింది చెబుదామని డాక్టర్ ఇంటికి ఒక్కపరుగులో వచ్చాడు సుందరం. అప్పటికే జరగవలసిందేదో జరిగి పోయింది!

బుజ్జిగాడి మీద పడి పారిజాతం కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఉంది.

కృష్ణమోహన్ వంచిన తలెత్తలేదు.

"ఏమయ్యా ఇంతసేపు?" రెట్టించాడు డాక్టర్.

సుందరం ముద్దాయిలా తలవంచుకొని నిలబడ్డాడు.

"మందులు అర్జంటుగా కావాలని చెప్పలేదూ నీకు? గాడిదకొచ్చిన వయసొచ్చింది. ఏం ప్రయోజనం? ఈ కాలం పిల్లలే ఇలా తయారయ్యారు. సరే పో! ఆ మందులు వాపస్ చేసిరా! చేజారిపోయిన కేసుతో డాక్టర్ గారికి నోరు జారటం తెలియలేదు.

"మందులు తేలేదు సార్!"

"ఏం?

"డబ్బెక్కడో పడిపోయింది సార్!

"ఆఁ!

అమాంతంగా నోరే తెరిచాడు డాక్టర్.

కృష్ణమోహన్ తల పైకెత్తి ఒక్క చూపు విసిరాడు. ఆ చూపుతో సుందరం భస్మీపటలం కావాల్సిందే! కానీ కాలేదు!

ఆ మరసటి రోజు-

పారిజాతం పెట్టిన పడక నుండి పైకి లేవలేదు. ఇరుగుపొరుగువాళ్ళు వస్తున్నారు. నాలుగు సానుభూతి మాటలు పలుకుతున్నారు. దాంతో మళ్ళీ బాధను తిరగదోడినట్లవుతూ ఉంది పారిజాతానికి. ఆమె 'బోరో' మని ఏడుస్తూ ఉంది. ఆమెను చూసి వచ్చినవాళ్ళు ఏడుస్తున్నారు.

కృష్ణమోహన్ అన్నింటికీ అతీతుడుగా మేడ పైకెక్కి తిన్నెమీద కూర్చున్నాడు. దూరంగా కనుపిస్తున్న కొండల్ని తదేకంగా చూస్తున్నాడు. రాధాకృష్ణ పక్కన్నే ఉన్నాడు. సుందరం ఎవరికీ మొగం చూపించలేకుండా ఏ మూల నక్కి ఉన్నాడో ఏమో?

"కృష్ణా! నువ్వెన్నయినా చెప్పు. సకాలంలో మందులంది ఉంటే బుజ్జిగాడు దక్కేవాడురా! ఆదర్శాలకు పోయి అన్యాయంగా బిడ్డను పోగొట్టుకొన్నావ్!

కృష్ణమోహన్ తలెత్తి ఒక్కసారి సూటిగా రాధాకృష్ణ మొగంలోనికి చూశాడు. మళ్ళీ యధాప్రకారంగా దూరంగా ఉన్న కొండలవైపు దృష్టిని మరల్చి మౌనంగా చూస్తున్నాడు.

"వాడా వెధవ సుందరం బుద్ధి అంతేనని నేనెప్పుడో చెప్పాను. విన్నావు కాదు. 'మా ఎద్దు మంచిది! మా ఎద్దు మంచిది' అని కొమ్మెత్తి ముక్కులో పెట్టుకొంటే ముక్కు చినిగిపోయినట్లయింది వ్యవహారం! ఈ వంద రూపాయలు కొట్టేయడానికిది ఒక ప్లాన్ అంతే! ఇప్పటికీ మించిపోయింది లేదు."

ఎక్కడున్నాడో ఏమో! ఎలావిన్నాడో ఏమో! ఈమాట చెవినిపడేసరికి సుందరం గుండెల్లో గునపాలు దించినట్లయింది. ఒక్క లగువులో వచ్చాడు. కృష్ణమోహన్ రెండు కాళ్ళూ ఒడిసి పట్టుకొన్నాడు.

"సార్! సార్! మీ పాదాల సాక్షిగా చెప్తున్నాను సార్! ఇంతకు మునుపు ఎప్పుడైనా పావలాకు, అర్ధకు పాలుమారిన మాట నిజమే సార్! కానీ ఈ రోజు మాత్రం మీ మీద

ఒట్టు సార్! పరుగెత్తుతూ ఉంటే ఎలా పడిపోయిందో ఏమో! ఆ దేవుడికే ఎరుక సార్! బుజ్జిగాణ్ణి పొట్టన పెట్టుకున్న పాపాత్ముణ్ణి. నన్ను కూడా చంపేయండి సార్! మీ చేతులతోనే చంపేయండి సార్!... మీ చేతులతోనే చంపేయండి సార్!"

పాదాల మీద పడి కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు సుందరం!

"పాదాలు ముట్టుకోవడానిక్కూడా అనర్హుడివి ఛీ! పో అవతలికి!"

నిర్ధాక్షిణ్యంగా కసురుకొన్నాడు రాధాకృష్ణ. సుందరం పట్టినపట్టు వదలలేదు.

కృష్ణమోహన్ మెల్లగా వంగాడు. భుజాలనుపట్టి సుందరాన్ని పైకిలేపాడు. అవిరళంగా వాడి కండ్లలో కారుతున్న కన్నీటిని తుడుస్తూ అలానే ఎదకు హత్తుకొన్నాడు.

ఛెళ్ళున చెంపదెబ్బ పడినా రాధాకృష్ణ అలా ఉలిక్కిపడేవాడు కాదేమో?

"రాధా! ఇలా జరిగి ఉంటే అలా జరిగి ఉండేది అని అనుకోవడం సాధారణంగా మానవ నైజం. కానీ నా నమ్మకమేమిటంటే ఏ వేళకు ఏది ఎలా జరగాలో అలాగే జరుగుతుందని. ఈ వయస్సు కొడుకే నాకు ఉన్నాడనుకో! వాడే ఇలా చెప్పి ఉంటే నేనేం చేసేవాడిని? పోనీ! లోకంలో ఎంతమంది కొడుకులు ఆస్తిపాస్తులకోసమని నిలువునా తల్లితండ్రుల గొంతులు కోయడం లేదు! జరిగిన దానిని సరిగ్గా అన్వయించుకోగలిగితేనే అనర్థాలకు దారి ఉండదు. ఇప్పుడేం కొదవ అయింది? వయస్సుంది. ఓపికా ఉంది. వీడికి తప్పక తమ్ముళ్ళు కలగతారన్న నమ్మకమూ ఉంది. ఈ జన్మలో పిడికెడంత ఈ గుండెకు గోరంత తృప్తి మిగలనీ."

కొండంత గుండె మీద వాలి సుందరం వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

రాధాకృష్ణ కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి! ●

ఆంధ్రప్రభ
(20, జూలై 1983)